క్లుప్తంగా

నేడు బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక

నర్వ: మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్‌సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు బీజేపీ నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఫాంహౌస్‌లో నిర్వహించే ఈ సమావేశానికి ఎన్నిక నిర్వాహకులు నర్వ మండల ఇన్‌చార్జ్ బలరాం రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశానికి మండల నాయకులు, అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లీకేజీ నీటితో తాగునీరు కలుషితం



అమరచింత: వాటర్ ట్యాంక్ ద్వారా వచ్చే తాగునీటి పైప్‌లైన్ లీకేజీలతో పరిసరాలు బురదమయంగా మారడంతో దుర్గంధం, దోమలు విపరీతంగా పెరిగాయంటూ కొంకన్‌వానిపల్లిలో మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. నీటి కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారంటూ మహిళలు చేస్తున్న నిరసనకు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తాగునీటి ట్యాంక్ వద్ద నీరు లీకేజీ అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలోని ఎనిమిదో వార్డులో ఉన్న తాగునీటి ట్యాంకులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. సమస్యను పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేక పోవడం సరికాదన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో మాధవి, సత్యమ్మ, మన్నెమ్మ, చంద్రి, మంగమ్మ పాల్గొన్నారు.

కడుపు మండుతున్న కనికరం లేదా?



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉపాధి హామీకూలీలకు మూడు నెలలుగా జీతాలు రాక కడుపు మండుతున్న ప్రభుత్వానికి కనికరం లేదా? అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ డబ్బులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపు కాలుతున్న కనికరం లేదా? నెలల తరబడి జీతాలు రాకుంటే మీరు పనిచేస్తారా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు మంచినీరు, టెంటు, ప్రాథమిక చికిత్స కోసం మెడికల్ కిట్లు పని ప్రదేశాలలో కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జాబ్ కార్డులు 137,407 ఉండగా కూలీల సంఖ్య 2,26,377 మంది ఉండగా, యాక్టివ్‌గా ఉన్న జాబ్ కార్డులో 89,155, వాటిలో లక్ష 34,275 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. ఇన్ యాక్టివ్ పేరుతో తొలగించిన 40,252 జాబ్ కార్డులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు గోపాల్, జిల్లా కార్యదర్శి కురుమూర్తి మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలకు కనీసం కూలీ డబ్బులు ఇవ్వకుండా, కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రుణ రాయితీ ప్రకటించడం సరికాదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌డీఏ, ఏఓ వి నారాయణరెడ్డి, డీబీటీ మేనేజర్ లక్ష్మీనారాయణలకు అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జగన్, జిల్లా ఉపాధ్యక్షులు వి హనుమంతు. ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు అంజన్న. జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జోగుళాంబ గద్వాల జోన్ -7 నుంచి టీఎస్‌పీఎస్సీ ద్వారా ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో ఇటీవల ఎంపికైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌లకు శనివారం జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు ఎస్సీడీడీ సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు కార్యాలయం వద్దకు చేరుకోవాలని, అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు 3సెట్ల జిరాక్స్‌లు అటెస్టెడ్‌తో రావాలని తెలిపారు.

బాధల 'బస్టాండ్'

- కనీస సౌకర్యాలు కరువు
- ఆధునీకరణపై నీలినీడలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



మరికల్ ఆర్టీసీ బస్టాండ్

మరికల్: మండల కేంద్రంలో 1983లో బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. కొన్నాళ్ల పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించిన అధికారులు రాను రానూ ఈ బస్టాండ్‌లో వసతుల గురించి పట్టించుకోవడం మానేశారు. మరికల్ మీదుగా ప్రతినిత్యం నారాయణపేట, మహబూబ్‌నగర్, ఆత్మకూర్, గుంటూర్, గోవా, రాయిచూర్, గుల్బర్గా, యాదగిరి, బెల్గాం తదితర పట్టణాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. కానీ బస్టాండ్ వసతుల లేమితో ప్రయాణికులు నానాఅవస్థలు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. మరికల్ తరహాలోనే మక్తల్, మద్దూర్, కోస్గి బస్టాండ్‌లోనూ సమస్యలు వెంటాడుతున్నాయి.

తిష్ట వేసిన సమస్యలు

మరికల్ బస్టాండ్‌లో తాగునీటితో పాటు మరుగుదొడ్లు, ప్రయాణికులు కూర్చోవడానికి సరైన షెల్టర్, క్యాంటీన్ లేకపోవడం వంటి ప్రధాన సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో పాటు బస్టాండ్ ఆవరణలో సీసీరోడ్లు లేకపోవడంతో బస్సుల రాకపోకల సమయంలో దుమ్ము, ధూళీ విపరీతంగా రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల క్రితం ఆర్టీసీ అధికారులు బస్టాండ్ ఆవరణలో మట్టి వేసి తాత్కాలికంగా గుంతలను పూడ్చి వేయించారు. ఆత్మకూర్–మరికల్ మధ్య నారాయణపేట డిపో నుంచి కాకుండా వనపర్తి డిపోకు చెందిన రెండు బస్సులు నడిపిస్తున్నారు. ఈ రూట్‌లో సరైనా బస్సులు లేక ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కనీసం ఆరు బస్సులను నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్ ఆధునీకరణ జరిగేనా..!

గత ప్రభుత్వం మరికల్ బస్టాండ్ రూపురేఖలు మార్చేందుకు రూ.1.20 కోట్లను మంజూరు చేసింది. అయితే గతైదాది శాసనసభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అప్పట్లో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో బస్టాండ్ ఆధునీకరణ మరమ్మతులు జరుగుతాయా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. 35 ఏళ్ల తర్వాత మరికల్ ఆర్టీసీ బస్టాండ్‌కు మహర్దశ వచ్చిందని అనుకుంటున్న తరుణంలోనే ఎన్నికలు రావడంతో బస్టాండ్ ఆధునీకరణ పనులు మూలనపడటానికి కారణమైంది. ప్రస్తుత ప్రభుత్వం బస్టాండ్ ఆధునీకరణ కోసం సీడీపీ నిధులు మంజూరు చేస్తే బస్టాండ్ ప్రాంగణంలోకి వర్షపునీరు రాకుండా పక్కాగా డ్రెయినేజీ, సీసీరోడ్లు, ప్రయాణికుల సౌకర్యార్థం కోసం నాణ్యమైన ఫర్నీచర్, నీటి వసతి, ప్లాట్ ఫారమ్ విస్తీర్ణం, క్యాంటీన్‌పై ఉన్న రేకులను తొలగించి శ్లాబ్ వేయాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ చేరిన 'ఇసుక' పంచాయితీ



తరలించేందుకు సిద్ధం చేసిన ఇసుక కుప్పలు

ధన్వాడ: ఇసుక రవాణా విషయంలో రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని గోటూర్ శివారులోని కోయిల్‌సాగర్ వాగు నుంచి ఇసుక తరలించేందుకు అధికార పార్టీకి చెందని వారు గతంలో మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. ఈ క్రమంలో వాగులో ఇసుక తరలించేందుకు నాయకులు హిటాచీని తీసుకొని వాగులోకి వెళ్లగా.. గ్రామానికే చెందిన మరో వర్గం వారు హిటాచీ ఆపరేటర్‌ను బెదిరించడంతో ఇసుక తరలింపు ఆగిపోయింది. దీంతో అనుమతులు తీసుకున్న వారు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో.. ఎస్ఐ హిటాచీ ఆపరేటర్‌ను బెదిరించిన వారిని స్టేషన్‌కు పిలిపించారు. ఒకటి రెండు ట్రిప్పుల ఇసుక రవాణా చేసేందుకు అనుమతులు తీసుకొని పగలు, రాత్రి తేడా లేకుండా పదుల సంఖ్యలో ట్రిప్పుల ఇసుక రవాణా చేస్తున్నారని వారు ఆరోపించారు. దీని ద్వారా గ్రామ పంచాయతీకి ఏమాత్రం లాభం లేకపోగా.. రోడ్లు దెబ్బతినడంతో పాటు దుమ్ము, ధూళీతో స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో ఇసుక తరలింపును అడ్డుకున్నామని వారు తెలిపారు. ఘటనపై ఎస్ఐ శేఖర్‌ను వివరణ కోరగా.. హిటాచి నిర్వాహకుల నుంచి ఫిర్యాదు మేరకు వారిని పిలిచి విచారించామని, తన పొలంలో పనులు చేసుకునేందుకు హిటాచీ తీసుకొస్తే కొందరు బెదిరించారని ఫిర్యాదుదారుడు తెలిపారన్నారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టం చేశారు.

చెక్‌పోస్టు తనిఖీ

కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణా చెక్‌పోస్టును తహసీల్దార్ వెంకటేష్ శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెక్‌పోస్టులో నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. కర్ణాటక నుంచి తెలంగాణకు వరి ధాన్యం రాకుండగా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

'గంజాయి వాడకం, అక్రమ రవాణా నిర్మూలిద్దాం'



మద్దూరు: నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో శుక్రవారం మద్దూరు పట్టణంలోని కిరాణా, పాన్ షాపులు, అనుమానంగా ఉన్న పంటపొలాల్లో, ఇతర ప్రదేశాల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమ రవాణా జరుగకుండా మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్నా, రవాణ చేసినా వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచతామనన్నారు. తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కీ, డాగ్ హ్యాండ్లర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బారులుతీరిన ధాన్యం ట్రాక్టర్లు



మరికల్‌లో బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

మరికల్: యాసంగి వరి కొనుగోళ్లు ఊపందుకోవడంతో మిల్లుల వద్ద ధాన్యం లారీలు, ట్రాక్టర్లు బారులు తీరాయి. దీంతో ధాన్యం లోడును ఖాళీ చేయడం కోసం రెండు రోజుల సమయం కూడా పడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్క రోజు మిలర్లు పదివేల బస్తాలను అన్‌లోడ్ చేస్తున్నారు. ధాన్యం లోడ్ ఖాళీ చేయడానికి సమయం ఎక్కువగా తీసుకోవడం వల్ల అదనపు రవాణా భారం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ధాన్యం నింపడం కోసం సంచులు లేక అధికశాతం రైతులు రోడ్లపై, పొలాల వద్ద నిల్వ చేసుకున్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ



మరికల్: మండల కేంద్రంలో జరిగిన ఉపాధి పనులపై శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభను నిర్వహించారు. సామాజిక బృందం మరికల్‌లో ఈ ఏడాది జరిగిన రూ.12 లక్షల ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన మస్టర్, కూలీల పని దినాల హాజరు రికార్డు, రైతుల పొలాల వద్ద జరిగిన పనుల వివరాలను సేకరించారు. కా ర్యక్రమంలో ఎంపీఓ పావని, కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికడదాం



మరికల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



గుండుమాల్‌లో..

కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమల వ్యాప్తిని అరికడదామని గుండుమాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు కిష్టమ్మ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని రామాలయం నుంచి శివాజీ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే చేపట్టాలన్నారు. నీటి నిల్వ ఉన్న ప్రదేశాలకు దోమలకు పుట్టినిల్లని, వేపాకు పొగతో వాటిని నివారించొచ్చన్నారు. కార్యక్రమంలో మనిమాల, నర్సింహారెడ్డి, సౌందర్య, వైష్ణవి, గాయత్రి, లక్ష్మి, శ్రీనివాస్, నర్సమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

మరికల్: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మరికల్‌లో ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో మలేరియా నివారణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, సిబ్బంది అరవింద్, సువర్ణ, వెంకటేశ్వర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి



అమరచింత: ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టి అర్హులైన నిరుపేదలకు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి డిమాండ్ చేశారు. పట్టణంలోని జీఎస్ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతుందని ఆరోపించారు. వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను నియమించిన అధికారులు.. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు చెప్పిన వివరాల ప్రకారం నివేదికలను తయారు చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లను ఎంపిక చేయాలంటే వార్డులో కమిటీ ద్వారా అక్కడి ప్రజలతో కలిసి సమావేశం నిర్వహించాలని, వారిలో అసలైన నిరుపేదలను గుర్తించి వారి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. నిజమైన అర్హులను ఎంపిక చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడించి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాజు, అజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

వినోదాత్మక విజ్ఞాన వేసవి శిబిరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సద్దాల హనుమంతు సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మే 3వ తేదీ నుంచి వినోదాత్మక వి/్ఞాన వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, బెక్కం జనార్దన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సుశ్రుత ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 10 ఏళ్ల దాటిన విద్యార్థులు పలు విభాగాల్లో శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల వారు 82470827738, 7396021638 నెంబర్లకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కురుమయ్య, ప్రమోద్, రాము, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోపాటు ఆధ్యాత్మిక చింతన పెంచుకోవాలి



బిజ్వార్‌లో రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఆదిత్య పరాశ్రీ

ఊట్కూర్: విద్యార్థులు చదువు, క్రీడలతో పాటు ఆధ్యాత్మిక చింతనపై ఆసక్తి పెంచుకోవాలని ఆదిత్య పరాశ్రీస్వామి అన్నారు. శుక్రవారం బిజ్వార్ గ్రామంలోని అంబత్రయ క్షేత్రంలో 44వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలను ఆదిత్య పరాశ్రీస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడలు తమ ఆశ్రమంలో నిర్వహించడం సంతోషకరమన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణ, పట్టుదల, దేహాదారుఢ్యం, మానసిక ప్రశాంతత కలుగుతాయని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో 33 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని రిటైర్డ్ పీఈటీ గోపాలం తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ సెక్రెటరీ సీహెచ్ ఐలయ్య, ఆర్గనైజర్ గోపాలం, పీడీలు విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, మంజునాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం

మాగనూర్: మండల కేంద్రంలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంపును ప్రారంభించినట్లు పీడీ రాకేష్‌శర్మ తెలిపారు. జూన్ 10వ తేదీ వరకు కొనసాగే ఈ క్యాంప్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 నుంచి 20 ఏళ్ల వయస్సు గల యువత 50 నుంచి 60 మంది పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఉదయం 6:30 నుంచి 8:30 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5:30 గంటల వరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఉన్న ఖాళీ స్థలంలో క్యాంపు నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, ఆనంద్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య, చెన్నప్ప, అశోక్‌గౌడ్, రాంగోపాల్‌శెట్టి, పూల రాము, పీఈటీ అంజనేయులు, అకాడమీ డైరెక్టర్ అంజేయులు తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో..

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల సర్వే



ఆలంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ జానయ్య



వద్వాట్‌లో..

మాగనూర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కోసం ఉన్నతాధికారులు ఆదేశాలతో ముగ్గురు గెజిటెడ్ అధికారుల బృందాలు గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన జాబితా ప్రకారం పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క దరఖాస్తును వదలకుండా సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన వారిని గుర్తించి వారికి ఇళ్లు వచ్చే విధంగా ఉన్నతాధికారులకు లిస్టు పంపిస్తామని తెలిపారు. అనంతరం రాజీవ్ యువవికాసంపై అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఆలంపల్లిలో..

కృష్ణా: మండలంలోని ఆలంపల్లి, హిందూపూర్ గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల అర్హుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జానయ్య మాట్లాడుతూ గ్రామాల్లోని ఇళ్లు లేనివారిని గుర్తించేందుకు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఇంటింటికీ వెళ్లి విచారణ చేసినట్లు తెలిపారు. అర్హులను గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.


ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి




మద్దూరులో నల్లబ్యాడ్జీలతో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ముస్లింలు

సాక్షి, నెట్‌వర్క్: రెండు రోజుల క్రితం జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని జిల్లావ్యాప్తంగా ఉన్న ముస్లిం, ప్రైవేట్ ఉపాధ్యాయ కమిటీ సభ్యులు ముక్తకంఠంతో ఖండించారు. ఈ మేరకు శుక్రవారం వారు అమరులకు సంఘీభావంగా కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాధిత కుటుంబాలకు దేశప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసానిచ్చారు. ఉగ్రవాదులను పట్టుకొని ఉరిశిక్ష అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

- మద్దూరులో జామ మజీద్‌లో ముస్లిం నల్ల రిబ్బన్లు కట్టుకొని నమాజ్ చేశారు. అనంతరం పాకిస్తాన్‌కు, పీఓకేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో షేక్ అహ్మద్, ఫీర్ అహ్మద్, మూసా, హబీబ్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.
- ధన్వాడ మండల కేంద్రంలోని జామీయా మజీద్‌లో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనలు చేశారు. ఉగ్రదాడిలో మృతిచెందిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.
- మరికల్‌లో అమరులకు ప్రైవేట్ ఉపాధ్యాయులు నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో మల్లేష్, తిరుపతయ్య, రఘు, జీవన్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మరికల్‌లో..



ధన్వాడలో..

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన



నవాబుపేట: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను మండల అధికారుల బృందం పరిశీలన ప్రారంభించింది. శుక్రవారం ఎంపీడీఓ జయరాంనాయక్ అధ్యక్షతన మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎస్‌బీఐ, కెనరా, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ తదితర బ్యాంకుల అధికారులు కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే వాటి గ్రౌండింగ్ కోసం ముందుకు వెళ్తామని వారు వివరించారు. మండలంలో రాజీవ్ యువ వికాసానికి మొత్తం 2912 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. వీటిలో బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి 1702, ఎస్సీ కార్పొరేషన్ 596, ఎస్‌టీ కార్పొరేషన్ 465, మైనార్టీ కార్పొరేషన్ 12 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

పారదర్శకంగా రాజీవ్ యువ వికాసం

చిన్నచింతకుంట: పారదర్శకంగా రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో చిన్నచింతకుంట, ఉంధ్యాల బ్యాంకర్లు, సిబ్బందితో రాజీవ్ యువ వికాసం పథకంపై సమావేశం నిర్వహించారు.